


ప్రతాప రవిశంకర్

# నువ్వు చచ్చిపోతే...

ఏడుస్తున్నారు. ఆ ప్రదేశమంతా ఏడుపులతో దద్దరిల్లి పోతోంది. రకరకాల మనుషులు- రకరకాల ఏడుపులు. ముసలివాళ్ళు ధైర్యంగా- పెద్దగా ఏడుస్తున్నారు. వయసులో వున్న వాళ్ళు బిడియపడుతూ చిన్నగా ఏడుస్తున్నారు. మధ్యమధ్యలో ముక్కులు చీదుతున్నారు. కళ్ళు తుడుచుకుంటున్నారు.

పైడిరాజు శవాన్ని వేపచెట్టుకింద పడుకోబెట్టారు. గుండెలమీదవరకూ తెల్లనిగుడ్డ కప్పారు. పైడిరాజు కళ్ళు కొంచెం తెరచుకుని వున్నాయి. ఆయన కళ్ళలోనుంచి పోయిందట ప్రాణం. ఆకాశంలోకిచూస్తున్నట్టున్నాడు పైడిరాజు.

ఆయనభార్య శకుంతలమ్మ పైడిరాజు తలదగ్గర కూర్చుంది. ఆమెపెద్ద కొడుకు విశ్వనాధం తండ్రి భుజాలదగ్గర కూర్చున్నాడు. అతని పెద్ద చెల్లెలు కస్తూరి పైడిరాజు నడుముదగ్గర కూర్చుంది. ఇంకో కొడుకూ-కూతురు ఏదో దూర ప్రాంతంనుంచి రావాలిట. వాళ్ళిద్దరికి కొంచెం చోటు వదలి మిగిలిన బంధువులందరూ వరుసగా కూర్చుని 'వెనక్కీ-ముందుకీ' వూగుతూ పైడిరాజు శవంమీద వాలుతున్న ఈగలను తోలుతూ ఏడుస్తున్నారు.

ఆ రోజు -ఆ వూరు వూరంతా అక్కడే వుంది. మరెవరైనా చచ్చిపోతే అంతమంది వచ్చేవాళ్ళు కాదేమో. కానీ, చచ్చిపోయింది పైడిరాజు ఎన్నోఏళ్ళనుంచీ ప్రెసిడెంటుగా ఆ వూరును ఏలుతున్న మకుటంలేని మహారాజు. అందుకే అంతమంది వచ్చారు. వచ్చిన వాళ్ళందరూ పైడిరాజుమృతదేహాన్ని చూశారు. అసలు ప్రాణం ఎలాపోయిందని చివరికి అడిగారు. గుండె ఆగిపోయిందిట అని ఎవరో చెప్పారు ఏడుపు తగ్గించి.

మిట్టమధ్యాహ్నం.

బ్రతికున్నప్పటి పైడిరాజు లీవిలా ఎండ మండుతోంది. నడివేసవికాలం. చెట్టునీడన గుంపులుగా నిల్చుని పైడిరాజు గొప్పతనం మంచితనం గురించి చెప్పుకుంటున్నారు మనుషులు.

"అమాయదారిదేవుడునన్నెత్తుకుపోయినా

బావుండేదిరా నాయనోవ్... ఎంత పనిచేశావురా దేవుడా? దేవుడులాంటి ఆయన్ని ఎత్తుకుపోయావుగదరో'' అంటూ దారుణంగా శోకాలు పెడుతూ ఏడుస్తోంది పైడిరాజు చేసుకున్న పెళ్ళాం శకుంతలమ్మ.

పైడిరాజులో ఏ కొంచెం ప్రాణంవున్నా భార్యమాటలకు లేచి కూర్చునేవాడే. ఎందుకంటే పైడిరాజు-శకుంతలమ్మను పెట్టిన కష్టాలకు అంతులేదు.

పెళ్ళయిన ఏడాదివరకూ శకుంతలమ్మ పైడిరాజుతో స్వర్గం అనుభవించింది. ఆ తర్వాతనించే ఆమెకు ప్రతిరోజూ నరకాన్ని చూపించేడు పైడిరాజు. ఆ యేడాదే ఆవూరు ఎలిమెంటరీ స్కూలుకు టీచరుగా వచ్చింది కనకం. పైడిరాజు కన్ను కనకం మీద పడింది. వలవేశాడు. చిక్కుకుంది కనకం. కనకంవలలో పైడిరాజు ఇరుక్కుపోయేడు. ఆ రోజునుంచీ పైడిరాజు మకాం కినకం ఇంట్లోనే. అప్పట్నుంచే శకుంతలమ్మకు కష్టాలు మొదలయినాయి. రోజు మొత్తం మీద ఒక్కసారి ఇంటికి వచ్చేవాడు పైడిరాజు. ఓ పది నిమిషాలుండి కనకం ఇంటికి బయల్దేరేవాడు. శకుంతలమ్మ అడ్డుపడేది కనకం ఇంటికి వెళ్ళొద్దని బతిమలాడేది. ప్రాధేయపడేది. పైడిరాజు వినేవాడు కాదు. శకుంతలమ్మను చావబాది వెళ్ళిపోయేవాడు. మొగుడితో విసిగిపోయింది శకుంతలమ్మ. పుట్టింటికి ప్రయాణమయింది ఆ నరకాన్ని అనుభవించలేక. కాని-పైడిరాజు భార్యను గడపదాటనివ్వలేదు. కాలుబయటపెడితే ప్రాణాలు తీస్తానని బెదిరించాడు, ఇంట్లోనే ఖైదుచేశాడు. ఖైదులో వుండే యాంత్రికంగా పిల్లలను కన్నది శకుంతలమ్మ. పిల్లలు పెరిగినా శకుంతలమ్మ స్థితి మారలేదు.

అలాంటి శకుంతలమ్మ ఈ రోజు పైడిరాజు బదులు తను చచ్చిపోయినా బావుండేదంటోంది,

పైడిరాజే చచ్చిపోకుండా వుంటే?

దిక్కుమాలిన సూర్యుడు పరుగులు దీస్తున్నాడు రేసుగుర్రంలా.

ఏడ్చేవాళ్ళలో శక్తినశించిపోతోంది. దాహమైనప్పుడల్లా నీళ్ళుతాగి మరీ ఏడుస్తున్నారు ఓపికచేసుకుని.

అందరూ పైడిరాజు రెండోకొడుకు, కూతురి కోసం ఎదురు చూస్తున్నారు. త్వరగా వస్తేబావుండు. శవాన్నితీసుకు పోవచ్చు. ఎందాకా ఏడ్చిచస్తాం? అని ఆత్రుతపడుతున్నారు ఏడుస్తున్నవాళ్ళంతా.

శవానికి కొంచెం దూరంగా కూర్చుని చుట్టలు కాల్చుకుంటున్న నలుగురు పెద్దమనుషుల్లో ఒకాయన పైడిరాజుకేసి చూస్తూ "మంచివాళ్ళు ఎక్కువకాలంబతకరంటారు. ఇదేనేమో లేకపోతే పైడిరాజుగారు పోవడమేమిటి? ఈ వూళ్ళో ఆయనమాటకు ఎదురులేదు. అందుకే ఆయన పోటీలేకుండా ఇన్నేళ్ళనించీ ప్రెసిడెంటవుతున్నాడు" అన్నాడు.

మిగిలినముగ్గురూ ఆయనకేసి ఆశ్చర్యంగా చూశారు. ఎందుకంటే పైడిరాజు పోటీ లేకుండా ఎలా ప్రెసిడెంటవుతున్నాడో ఆ వూళ్ళో అందరికీ తెలుసు.

పైడిరాజుకు ముప్పైయేళ్ళున్నప్పుడు ప్రెసిడెంట్ ఎన్నికల్లో నిలబడ్డాడు. పైడిరాజుకు ఆయేడే తండ్రి పోయాడు: ఆస్తంతా అతని చేతుల్లోకి వచ్చింది. అతని పక్కనే ఎప్పుడూ ఓ పదిహేనుమంది స్నేహితులుంటారు. వాళ్ళే పైడిరాజును ఎన్నికల్లో నిలబడమన్నారు, పైడిరాజుకు పోటీగా మరో వ్యక్తినిలబడ్డాడు. ఆయనకు బాగా పలుకుబడివుంది. ఆయన గెలవడంలో ఎటువంటి అనుమానంలేదని పైడిరాజుకు తెలుసు. అందుకే ఆయనను మర్యాదగా

పోటీనించి తొలగిపొమ్మని తన మనుష్యుల చేత చెప్పించాడు. కాని ఆయన వినలేదు. ఫలితం ఆరోజు ఆయన పక్కగ్రామానికి వెళ్ళితిరిగి వస్తుంటే ఎవరో ఆయన తల పగలకొట్టేరు. ప్రాణం పోయిందనే అనుకున్నారు. కాని అయన బ్రతికేడు. మళ్ళీ ఎన్నికల్లో నిలబడలేదు.

ఆయేడు పైడిరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. తర్వాత కూడా మరోసారి అలాగే జరిగింది.

అప్పట్నుంచీ ప్రెసిడెంట్ ఎన్నికల్లో పైడిరాజుకు పోటీలేదు. పైడిరాజుకు ఎదురుగా నిలబడి తల పగలకొట్టించుకోటానికి ఎవ్వరూ సాహసించలేదు. ఇది నలుగురికీ తెలిసిన రహస్యం.

రోడ్డుమీద జట్కా ఆగింది. అందులోంచికిందికి దిగింది పైడిరాజు రెండో కూతురు గిరిజ పెట్టాబేడా తీసికొని. దిగడంతోటే ఒక్కవుదుట్న పరిగెత్తుకుంటూ వచ్చి తనకై ప్రత్యేకించిన ఖాళీలో కూర్చుని "నాన్నా" అంటూ ఆయన గుండెలమీద కూలబడిపోయింది. పైడిరాజు బ్రతికున్నటయితే ఆ కుదుపుకు "అబ్బా" అనేవాడు.

గిరిజ రావడంతో ఏడుపులస్థాయి మళ్ళీ పెరిగిపోయింది. అందరూ శ్రుతిపెంచారు. గోల.

"ఎంత ఘోరం జరిగింది నాన్నా? దేవుడెంత ద్రోహం చేశాడు.. మాకెంత అన్యాయం చేశావునాన్నా? మమ్మల్ని ఎంత గారాబంగా పెంచావునాన్నా? అంటూ నోరుమయ్యకుండా ఏడుస్తూంది గిరిజ ముందే ప్రిపేరయి వచ్చినట్టు.

మరో సమయంలో ఐతే గిరిజతల్లి శకుంతలమ్మ "అదేమిటే తల్లీ" మీ మాట మీ నాన్న ఎన్నడూ కాదనలేదా?" అని నిలదీసి అడిగేదే.

ఎందుకంటే-గిరిజ సినిమాలోలా ప్రభాకర్‌ను ప్రేమించింది. అతను ఓసన్నకారు రైతుకొడుకు. ఐతేనేం? అందమైనవాడు. గిరిజతో కాలేజీలో చదువుతున్నవాడు. ఇద్దరూ పెళ్ళిచేసుకోవా లనుకున్నారు. ఈ విషయాన్ని తండ్రితో చెప్పింది గిరిజ. పైడిరాజు మొదట షాక్ తిన్నాడు. తర్వాత ఇలాగ జరగటానికి వీల్లేదన్నాడు. గిరిజ ఏడ్చింది. తన శవాన్ని చూడవలసివస్తుందన్నది.

సరేనన్నాడు పైడిరాజు.

ఆ మూడోరోజు ప్రభాకరం ఎవ్వరికీ కనిపించలేదు. ఆ తర్వాత నాలుగురోజులకు అతని శవం బందరులాకుల దగ్గర తేలింది. పైడిరాజు గర్వంగా మీసాలను మెలివేశాడు. తరవాత ఈ విషయం అందరికీ తెలిసింది. గిరిజకూ్కడా తెలిసింది. కుమిలి కుమిలి ఏడ్చింది తండ్రి దుర్మార్గాన్ని ద్వేషించింది.

అలాంటిగిరిజ ఈ రోజు ఇలా...

సూర్యుడు కిందికి దిగిపోతున్నాడు. ఎండ కరిగిపోతోంది. అవతల బ్రాహ్మలు తొందర పెడుతున్నారు.— చీకటిపడితే దహనం చెయ్యకూడదని.

"చిన్న కొడుకు వచ్చేవరకు శవాన్ని వుంచ కూడదు. సూర్యాస్తమయంకాక ముందే శవాన్ని లేవదీయాలి" అన్నారు. అందులకు అందరూ తలలువూపేరు.

నిమిషాల మీద పనులు మొదలైనాయి. వెదురు బద్దలు-తాళ్ళు తీసుకొచ్చారు. పాడె తయారవుతోంది.

ఏడుపు ఆపి అంతా రెస్ట్ తీసుకుంటున్నారు.

అప్పుడే ఏదో పూర్తిచేసి వచ్చిన ఒక రైతుకు పైడిరాజు పోయేడని తెలిసింది. ఇంకేముంది? పరిగెత్తుకుంటూ అక్కడకు వచ్చాడు. కొంచెం సేపు శవాన్ని చూసి తర్వాత పక్కనున్నాయనతో "పైడిరాజు అదృష్టవంతుడయ్యా పెద్దతనంలో మంచాన పడకుండా తిరుగుతూనే పోయేడు ఎంత మందికి ఆ భాగ్యం? ఏమైనా ఆయన చేసుకున్న పుణ్యం ఏమవుతుంది? మనందరికీ ఎంతసహాయంచేశాడు? ఎంతమంది బీదపిల్లలకు పెళ్ళిళ్ళుచేశాడు?" అంటున్నాడు ఆయన పక్కనే వున్నాయన "ఓరి నీనోరు పడిపోనూ" అన్నట్టుచూశాడు.

ఎందుకన్నట్టు చూశాడీయన.

'ఎందుకేమిటి? నాకూతురు ఎందుకు చచ్చిపోయిందో నీకుతెలియదూ?'

'తెలిస్తేమాత్రం? పైడిరాజు ఇప్పుడు చచ్చిపోయేడుగదా మనం ఆయన గురించి మంచిగానే చెప్పాలోయ్.'

ఇంతకీ ఆయన కూతురు ఎందుకు చచ్చిపోయిందంటే-

ఆయన కూతురు సుశీలకు పెళ్ళి నిశ్చయమయింది. అందుకని ఆయన పైడిరాజు దగ్గరకు సహాయం చెయ్యమని అడగడానికి వచ్చాడు. పైడిరాజు తగిన సహాయం చేస్తానని మాటఇచ్చాడు

ఆ మరురోజు పైడిరాజు పొలంనుంచి తిరిగివస్తూ సుశీల గుడిసెలోకి వెళ్ళాడు. తండ్రి లేడు సుశీలకు తల్లి చిన్నతనలోనే పోయింది. ఒంటరిగా ఉంది సుశీల. మంచి అవకాశందొరికింది అనుకున్నాడు పైడిరాజు. తన గొప్పతనాన్ని సుశీలముందు చిత్రించి ఒప్పుకోమన్నాడు. కాని సుశీల ఒప్పుకోలేదు. 'అన్యాయం -నీకూతురులాంటిదాన్ని, ఇలా కోరటం,' అన్నది. 'నేనునిన్నుకన్నానుటే చిలకా' అంటూ బలత్కారానికి పూనుకున్నాడు పైడిరాజు. తన కోరికతీర్చుకున్నాడు. ఆ రాత్రే సుశీల శవం ఓనూతిలో తేలింది.

ఇలాంటి ఘోరాలు ఇంకెన్నోచేశాడు పైడిరాజు. ఐనాఆ రోజుపైడిరాజు పుణ్యాత్ముడు. పాడెసిద్ధమయింది. పైడిరాజుశవాన్ని పాడె మీద పడుకోబెట్టి గట్టిగాబిగించారు మళ్ళీలేస్తాడేమోనన్నట్టు, బంధువులు నలుగురు నడుములకు గుడ్డలుబిగించి పాడెకు నాలుగువైపులా నిల్చున్నారు.

అందరూ పైడిరాజును చివరిచూపు చూశారు. ఆయన భార్య, పిల్లలు, బంధువులూ అందరూ పైడిరాజు శవానికి నమస్కారాలుచేశారు.

చీకటి పడబోతోంది.

పాడెకదిలింది. పైడిరాజు శవం పైకి లేచింది.

మళ్ళీఏడుపులు చెలరేగాయి.

"పుణ్యాత్ముడు, మహారాజులా వెళ్ళిపోతున్నాడు" అన్నారు ఏడుస్తూనే

శవంగా మారిన పైడిరాజు మాత్రం "ఈ మనుషులు ఎంత పిచ్చివాళ్ళు? ఇంత దుర్మార్గుణ్ణి పట్టుకుని పుణ్యాత్ముడంటున్నారు నేను మంచివాడినా?" అని ముసిముసిగానవ్వుకున్నాడు పాడెమీద వూరేగుతూ. •

ఆత్మవిమర్శని అంకురింపజేసేది
ఆలోచనలని వికసింపజేసేది
ప్రజాతంత్ర
వారపత్రిక